

ప్రజా న్యూస్
నెటవర్క్
నిజం.. సమాజం.. ప్రజా కోసం.. తెలుగు దినపత్రిక



సంపుటి :01,సంచిక : 192,చీఫ్ ఎడిటర్ : వి.శివ కృష్ణ, వెల : 02,మంగళవారం , తేదీ : 17-11-2026

PUBLISHED BY HYDERABAD : Circulation Areas:

సూర్యాపేట జిల్లా,నల్లగొండ జిల్లా,యాదాద్రి భువనగిరి జిల్లా,సంగారెడ్డి జిల్లా,రంగారెడ్డి జిల్లా,మల్కాజ్గిరి,వనపర్తి జిల్లా,మేడ్చల్ -మల్కాజ్ గిరి జిల్లా,కాకినాడ,వైజాగ్,పల్నాడు.

అక్వాన్ తుపాను నేపథ్యంలో అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాలు



ఏపీ రాష్ట్రానికి అక్వాన్ తుపాను ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సంబంధిత అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. తుపాను ప్రభావం వల్ల పంటలకు నష్టం కలగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు.

అమరావతి, నవంబర్ 16: ఏపీ రాష్ట్రానికి అక్వాన్ తుపాను ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సంబంధిత అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. తుపాను ప్రభావంతో పంటలకు నష్టం కలగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. మిగతా..2లో

బంగాళాఖాతంలో తుపాన్ - తెలంగాణలో 3 రోజుల పాటు వర్షాలు!



బంగాళాఖాతంలో ఏర్పడిన అక్వాన్ తుపానుతో రాష్ట్రంలో 3 రోజుల పాటు వర్షాలు కురవొచ్చని ఐఎండీ పేర్కొంది. ముఖ్యంగా తూర్పు జిల్లాల్లో భారీ వానలు పడొచ్చని తెలిపింది.

హైదరాబాద్: బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను కారణంగా ఈ నెల 19, 20, 21 తేదీల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. 19న ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో బలమైన గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని తెలిపింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసినట్లు పేర్కొంది. తుపాను ప్రభావంతో ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురవొచ్చని తెలిపింది. మిగతా..2లో

మూడేళ్ల పాలనలో మిగిలింది హామీలేనా?
కాంగ్రెస్‌పై హరీశ్ ప్రశ్నాస్త్రాలు



★ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్ధిపేట పర్యటన నేపథ్యంలో హరీశ్ రావు సీఎంకు బహిరంగ లేఖ రాశారు.

★మూడేళ్ల పాలనలో సిద్ధిపేటకు, తెలంగాణ ప్రజలకు ఏం చేశారు అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు.

సిద్ధిపేట, నవంబర్ 16: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్ధిపేట పర్యటన నేపథ్యంలో హరీశ్ రావు సీఎంకు బహిరంగ లేఖ రాశారు. మూడేళ్ల పాలనలో సిద్ధిపేటకు, తెలంగాణ ప్రజలకు ఏం చేశారు అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో మిగిలింది హామీలేనంటూ ఎద్దేవా చేశారు. 'నా మీద కక్ష ఉంటే నాపై చూపించు.. ప్రజలపై ఎందుకు? సిద్ధిపేట తెలంగాణలో లేదా..? సిద్ధిపేటలో అభివృద్ధి నిధులు ఎందుకు నిలిపివేశారు?

ఇళ్లే పథకం లబ్ధిదారులకు తెలంగాణ సర్కార్ ఊరట

★2014కు ముందు ఎంపిక చేసిన ఇళ్ల పథకం లబ్ధిదారులకు తెలంగాణ ప్రభుత్వం ఊరట కల్పించింది.

★ఇంటి పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్ల వాపస్‌కు కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు.

★రాష్ట్రవ్యాప్తంగా 7 లక్షల మంది లబ్ధిదారులకు ఈ ప్రయోజనం కలగనుంది.



హైదరాబాద్, నవంబరు 16: 2014కు ముందు ఎంపిక చేసిన ఇళ్ల పథకం లబ్ధిదారులకు తెలంగాణ ప్రభుత్వం ఊరట కల్పించింది. ఈ మేరకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. ఇంటి పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్ల వాపస్‌కు కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 7 లక్షల మంది లబ్ధిదారులకు ఈ ప్రయోజనం కలగనుందని తెలిపారు. తహసీల్దార్ కార్యాలయాల్లో ఉన్న పట్టాలను లబ్ధిదారులకు తిరిగి ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. 22 ఏ భూముల సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి ఈ అంశం రావడంతో ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారని అన్నారు. సీఎం ఆదేశాలతో దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న పట్టాల సమస్యకు పరిష్కారం కలిగిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. మిగతా..2లో

రైతులకు ఎకరాకు రూ.25 వేల పరిహారం ఇవ్వాలి



●తెలంగాణ రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు నెలకొన్నాయని,

●రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు.

నిజామాబాద్, నవంబరు 16: తెలంగాణ రాష్ట్రంపై ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉందని, రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించాలని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కరువు పరిస్థితులను సమగ్రంగా పరిశీలించి కరువు మండలాలుగా ప్రకటించాలని, పంటలు నష్టపోయిన రైతులకు మిగతా..2లో

జమ్మూకశ్మీర్‌లో ఎన్ కౌంటర్
ఓ ఉగ్రవాది హతం

●జమ్మూకశ్మీర్‌లోని కుల్గామ్ జిల్లాలో భద్రతా బలగాలకు, ఉగ్రవాదులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి.

●ఈ ఘటనలో ఓ ఉగ్రవాది హతమవగా మరో ఉగ్రవాదిని భద్రతా బలగాలు చుట్టుముట్టాయి.



ఢిల్లీ : జమ్మూకశ్మీర్‌లోని కుల్గామ్ జిల్లాలో భద్రతా బలగాలకు, ఉగ్రవాదులకు మధ్య సోమవారం ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఓ ఉగ్రవాది హతమవగా మరో ఉగ్రవాదిని భద్రతా బలగాలు చుట్టుముట్టాయి. ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన ఉగ్రవాదిని లతీఫ్ భట్‌గా పోలీసులు గుర్తించారు. కుల్గామ్‌లో గతవారం జశ్రాఖీ పోస్టుపై జరిగిన దాడిలో ముగ్గురు సిబ్బంది గాయపడ్డారు. ఆ దాడికి బాధ్యులైన వారిని గుర్తించి, పట్టుకోవడానికి భద్రతా సంస్థలు భారీ ఎత్తున గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో ఉగ్రవాదులు ఉన్న ప్రాంతాన్ని గుర్తించిన ఆర్మీ, జశ్రాఖీ, జమ్మూకశ్మీర్ పోలీసుల ప్రత్యేక బృందాలు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టాయి. వర్గాల సమాచారం ప్రకారం, కుల్గామ్ నివాసి అయిన భట్, ఓవర్‌గ్రౌండ్ వర్కర్ల నెట్‌వర్క్ సహాయంతో దక్షిణ కశ్మీర్‌లోని రహస్య స్థావరాల మధ్య తిరుగుతూ, పాకిస్తాన్ ఉగ్రవాదులతో మిగతా..2లో

తెలంగాణకు పొంచి ఉన్న తాగునీటి ముప్పు..
శ్రీశైలంలో తగ్గుతున్న నీటి మట్టం



❖శ్రీశైలం జలాశయంలో 829 అడుగులకు పడిపోయిన నీటి మట్టం

❖వరుసగా వాయిదా పడుతున్న కేఆర్ఎంబీ జీఆర్ఎంబీ సమావేశాలు

❖తెలంగాణ ఆంధ్రప్రదేశ్ మధ్య తేలని తాగునీటి కేటాయింపులు

❖సకాలంలో నిర్ణయాలు తీసుకోకుంటే వేసవిలో తీవ్ర తాగునీటి ఎద్దడి

తప్పుడు సమాచారం అందించారా? లేక సుప్రీంను తప్పుదోవ పట్టించారా?
అయోధ్య విరాళాలపై కాంగ్రెస్ కొత్త డిమాండ్

●అధునాతన సాంకేతికతను వినియోగించుకునే దేశంగా కాకుండా కీలక రంగాల్లో నూతన ఆవిష్కరణలు చేస్తూ ప్రపంచానికి నాయకత్వం వహించే స్థాయికి భారత్ ఎదగాలని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆకాంక్షించారు.

●రామ మందిర విరాళాల దొంగతనం కేసులో నేరుగా సుప్రీంకోర్టుకు నివేదిక సమర్పించే సిట్ ను ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది.



ఢిల్లీ : రామ మందిర విరాళాల దొంగతనం కేసు విషయంలో అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేసే బాధ్యతతో సుప్రీంకోర్టుకే నివేదించే విధంగా స్వతంత్ర సిట్ ను ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఆ విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మౌనం దేశానికి తీవ్ర ఆందోళన కలిగిస్తోందని ప్రతిపక్ష పార్టీ పేర్కొంది. ప్రజల విశ్వాసాన్ని మోసం చేసిన వారిని జవాబుదారీగా చేయాలని ఉద్ఘాటించింది. ఈ మేరకు కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌ఛార్జి జైరాం రమేశ్ సోమవారం ఉదయం ఎక్స్ లో పోస్ట్ పెట్టారు. దొంగతనం ఎప్పుడూ దాగి ఉండదు ఆలస్యంగానో, త్వరగానో అది బయటపడక తప్పదన్నారు జైరాం రమేశ్. అయోధ్యలోని రామ మందిరంలో కానుకల చోరీపై ప్రతిరోజూ వెలుగులోకి వస్తున్న కొత్త విషయాలు, మిగతా..2లో

ఐసీసీ ఛైర్మన్‌గా జై షా రెండోసారి ఎన్నిక..
అభినందనలు తెలిపిన మంత్రి నారా లోకేశ్



★ఐసీసీ ఛైర్మన్‌గా జై షా రెండోసారి పునర్నియామకం అవడంపై ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అభినందనలు తెలిపారు.

★ఈ మేరు ఎక్స్ వేదికగా లోకేశ్ పోస్టు పెట్టారు.

అమరావతి, నవంబరు 16 : ఐసీసీ ఛైర్మన్‌గా జై షా రెండోసారి పునర్నియామకం అయ్యారు. బాలిలో జరిగిన ఐసీసీ బోర్డు సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

అర్హులైన పేదవారికి చేయూత పెన్షన్లు
అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

●తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 4.64 లక్షల కొత్త పెన్షన్లను మంజూరు చేశామని..

●పెన్షన్ల ద్వారా పేదవారికి చేయూత అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.



సిద్ధిపేట, నవంబర్ 16: రాష్ట్రవ్యాప్తంగా 4.64 లక్షల కొత్త పెన్షన్లను మంజూరు చేశామని.. పెన్షన్ల ద్వారా పేదవారికి చేయూత అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. జిల్లాలోని అక్కన్నపేట మండల కేంద్రంలో పర్యటించిన మంత్రి చేయూత పెన్షన్‌దారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. సిద్ధిపేట జిల్లాలోని అక్కన్నపేట మండలం కేంద్రంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన నూతన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని.. పెన్షన్‌దారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాల గురించి మాట్లాడారు. అర్హులైన ప్రతి పేదవారికి చేయూత పెన్షన్లు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 7 రకాల పెన్షన్ల కింద 4.64 లక్షల కొత్త పెన్షన్లు మంజూరు చేశామని.. ఇంకా పెన్షన్ అందని అర్హులు ఎవరైనా ఉంటే, వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి ప్రతీ ఒక్కరికి పెన్షన్‌లు అందిస్తామని మంత్రి పొన్నం హామీ ఇచ్చారు. మహిళా సంఘాలకు ఇప్పటివరకు 79 వేల కోట్ల రూపాయల రుణాలను వడ్డీ లేకుండా అందించామన్నారు.

వైసీపీ నేతల అవినీతిపై వెబ్ సిరీస్ తీస్తే
అంతం ఉండదు.. అంతులేని కథలా సాగుతూనే ఉంటుంది



★వైసీపీ నాయకత్వంపై కొల్లు రవీంద్ర ఫైర్

★పీఏలే వేల కోట్లు దోస్తే యజమాని జగన్ ఇంకెన్ని లక్షల కోట్లు తిన్నారని ప్రశ్న

★దోచుకున్న ప్రజాధనాన్ని విదేశీ వ్యాపారాల్లో పెట్టుబడులుగా మళ్లించారని ఆరోపణ

★సాధారణ ఉద్యోగుల కుటుంబాల పేరిట వందల కోట్ల ఆస్తులు వెలుగులోకి

★నాసిరకం మద్యంతో వేలాది మంది మహిళలను వితంతువులుగా మార్చారని ఆగ్రహం

మొదటి పేజి తరువాయి

ఈ నెల 20న కోస్తాంధ్రను తాకనున్న తీవ్ర తుపాను..
అధికారులకు చంద్రబాబు కీలక ఆదేశాలు

క్రమంగా బలపడుతోందని, ఇవాళ సాయంత్రానికి ఇది తుపానుగా మారే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. దీని ప్రభావంతో ఈ నెల 19, 20 తేదీల్లో కోస్తాంధ్ర తీర ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే వీలుందని తెలిపారు. గతంలో వచ్చిన అర్నబ్ తుపాను తరహాలోనే దీని తీవ్రత కూడా ఉండే అవకాశం ఉందని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. రానున్న తుపాను ప్రభావం ప్రధానంగా అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలతో పాటు పరిసర ప్రాంతాలపై ఎక్కువగా ఉండే అవకాశం ఉందని వాతావరణ విభాగం అంచనా వేసింది. తుపాను కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎప్పటికప్పుడు అంచనా వేయాలని సీఎం సూచించారు. గతంలో కేంద్ర బృందం చేసిన సిఫార్సులను పరిగణనలోకి తీసుకుని, వాటిని క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. తీవ్ర ప్రభావం ఉండే అవకాశమున్న ప్రాంతాలకు ముందస్తుగానే ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను తరలించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తుపాను కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే ఏమాత్రం ఆలస్యం చేయకుండా, యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించేలా సిబ్బందిని, యంత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. అదే సమయంలో భారీ వర్షాల వల్ల వచ్చే వరద నీటిని సమర్థవంతంగా రిజర్వాయర్లకు మళ్లించేలా చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఐసీసీ ఛైర్మన్‌గా జై షా రెండోసారి ఎన్నిక..
అభినందనలు తెలిపిన మంత్రి నారా లోకేశ్

జై షా పేరును ఐసీసీ డైరెక్టర్లు ప్రతిపాదించారు. అయితే, ఐసీసీ ఛైర్మన్‌గా జై షా రెండోసారి ఎన్నికవవడంపై ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా లోకేశ్ పోస్టు పెట్టారు.

జై షాకు సంపూర్ణ విజయం చేకూరాలి..

'నా మిత్రుడు జై షా ఐసీసీ ఛైర్మన్‌గా రెండోసారి నియమితులవడం చూసి చాలా సంతోషంగా ఉంది. ఆయన ఏకగ్రీవంగా తిరిగి ఎన్నికవడం, క్రికెట్ ప్రపంచం మొత్తం జై షాపై ఉంచిన నమ్మకానికి నిదర్శనం. ఆయన ఎన్నిక భారతదేశానికి గర్వకారణం. ఈ క్రీడను మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లడంలో జై షాకు సంపూర్ణ విజయం చేకూరాలని ఆకాంక్షిస్తున్నాను' అని లోకేశ్ పేర్కొన్నారు.

అక్వాన్ తుపాను నేపథ్యంలో
అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాలు

రైతుల పంటలు, మత్స్యకారుల ప్రాణాలు, వారి జీవనోపాధిని కాపాడటమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని.. అధికారుల నిర్లక్ష్యాన్ని సహించేది లేదని హెచ్చరించారు. ఏపీకి అక్వాన్ తుపాను ముప్పు పొంచియున్న నేపథ్యంలో మంత్రి అచ్చెన్నాయుడు అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. తుపాను ప్రభావంతో పంటలకు ఎలాంటి నష్టం కలగకుండా ముందు జాగ్రత్తగా రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 23.87 లక్షల హెక్టార్లలో సాగులో ఉన్న వ్యవసాయ పంటలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా తీర ప్రాంతంలోని 10 జిల్లాల వ్యాప్తంగా 9.15 లక్షల హెక్టార్లలో గల వ్యవసాయ పంటల రక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. తుపాను ప్రభావిత 16 జిల్లాల్లో గల 2. 69 లక్షల హెక్టర్లలో సాగులో ఉన్న ఉద్యానవన పంటలపై ప్రత్యేక పర్యవేక్షణ నిర్వహించాలన్నారు. కోతకు సిద్ధంగా ఉన్న పంటలను ముందుగానే.. కోసి సురక్షిత ప్రాంతాలకు ధాన్యాన్ని తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు తుపాను కారణంగా ఉద్యానవన పంటలకు నష్టం కలిగితే.. 24 గంటల్లో ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక ఇవ్వాలని అధికారులకు సూచించారు. వారం రోజుల్లో రైతులవారీగా పూర్తి వివరాలను అందించాలని స్పష్టం చేశారు. అంతేకాకుండా తుపాను నేపథ్యంలో మత్స్యకారులు కూడా చేపల వేటకు సముద్రంలోకి వెళ్లరాదని మంత్రి హెచ్చరికలు జారీ చేశారు. మొత్తం 30,808 మత్స్యకార బోట్లలో.. 30,635 బోట్లు సురక్షితంగా తీరం చేరాయని, మిగిలిన 173 బోట్లపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మత్స్యకారులకు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశామని.. నాభిమిత్ర ద్వారా 8,217 బోట్ల ట్రాకింగ్‌ను చేపట్టినట్లు మంత్రి వెల్లడించారు.

మూడేళ్ల పాలనలో మిగిలింది హామీలేనా?
కాంగ్రెస్‌పై హరీశ్ ప్రశ్నాస్త్రాలు

సిద్దిపేటకు మంజూరైన వెటర్నరీ కాలేజీని కొడంగల్‌కు తరలించారు.. ఇదేనా మీ ప్రాంతీయ న్యాయం? సిద్దిపేట అభివృద్ధికి సంబంధించిన రూ.1,070 కోట్ల నిధులను నిలిపివేశారు. 87 నియోజకవర్గాలకు యంగ్ ఇండియా స్కూల్స్ మంజూరు చేశారు.. సిద్దిపేటకు ఎందుకు ఇవ్వలేదు? సిద్దిపేట ప్రజలపై వివక్ష ఎందుకు. నా పొడుగు.. కేటీఆర్ గడ్డం గురించి మాట్లాడేందుకు చాలా వేదికలున్నాయి.. సీఎం పర్యటన ఉద్దేశం.. ప్రజా సమస్యలను పరిష్కరించడం. ఇచ్చిన హామీలను నెరవేర్చి సిద్దిపేటకు రా.. బోకే ఇచ్చి స్వాగతం పలుకుతా.. ' అంటూ హరీశ్ రావు తీవ్రంగా విమర్శించారు. మూడేళ్ల పాలన.. మిగిలింది హామీలేనా? 45 రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు బంధు ఇస్తామన్నారు.. 230 రోజులైనా రైతుల ఖాతాల్లో జమ కాలేదు. మూడు ఆగస్టు 15లు గడిచినా రైతు రుణమాఫీ పూర్తి కాలేదు. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో ఒక్క ప్రాజెక్టు కట్టారా..? ఒక్క ఎకరాకు నీళ్లిచ్చారా..? నాలుగు వేల పింఛన్ ఎప్పటి నుంచి..? మహిళలకు నెలకు రూ.2,500 ఎప్పుడు ఇస్తారు..? మల్లన్నసాగర్ నిర్వాసితులకు మూడేళ్లయినా న్యాయం చేయలేదు.. బాధితుల సమస్యలు ఎందుకు పరిష్కరించడం లేదు. 50 పడకల ఆయుష్ ఆస్పత్రి ప్రారంభించినా.. వైద్య సేవలు శూన్యం. ఇదేనా అభివృద్ధి? మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయలేదు.. విద్యార్థుల భవిష్యత్తు ఏమైపోవాలి?' అంటూ హరీశ్ బహిరంగ లేఖలో సీఎంపై ప్రశ్నల వర్షం కురిపించారు.

తెలంగాణకు పొంచి ఉన్న తాగునీటి ముప్పు..
శ్రీశైలంలో తగ్గుతున్న నీటి మట్టం

హైదరాబాద్: శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలు ప్రమాదకర స్థాయికి పడిపోవడం, కృష్ణా-గోదావరి నదీ యాజమాన్య బోర్డుల (కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీ) సమావేశాలు నిరంతరం వాయిదా పడుతుండడం నేపథ్యంలో.. తెలంగాణలో తాగునీటి సంక్షోభం పొంచి ఉందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌తో నీటి పంపకాల సమస్యలు ఇంకా పరిష్కారం కాకపోవడంతో రానున్న వేసవిలో హైదరాబాద్‌తో పాటు దక్షిణ తెలంగాణ జిల్లాలకు నీటి ఇబ్బందులు తప్పవని భావిస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయం నీటిమట్టం 829.10 అడుగులకు చేరింది. పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, కనీస నీటిమట్టం (834 అడుగులు) కంటే దిగువకు పడిపోయింది. మొత్తం 215.80 టీఎంసీల సామర్థ్యానికి గాను కేవలం 48.57 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉన్నాయి. జూరాల, సుంకేసుల, హంద్రీ నదుల నుంచి ఇన్‌ఫ్లోలు పూర్తిగా నిలిచిపోయాయి. నవంబర్ మొదటి తొమ్మిది రోజుల్లోనే 3.03 టీఎంసీల మేర నిల్వలు తగ్గాయి. ఎల్‌నినో ప్రభావం వల్ల ఈ ఏడాది వార్షిక ప్రవాహాలు 218 టీఎంసీలకు మాత్రమే పరిమితమయ్యాయి. రానున్న రోజుల్లో ఆవిరి కావడం, వేసవి డిమాండ్ పెరగడం వల్ల రిజర్వాయర్‌పై ఒత్తిడి మరింత పెరిగే అవకాశం ఉంది. మరోవైపు, మే నెల నుంచి జరగాల్సిన 21వ కేఆర్ఎంబీ సర్వసభ్య సమావేశం వరుసగా వాయిదా పడుతూ వస్తోంది. చివరిసారిగా 2025 జనవరి 21న ఈ సమావేశం జరిగింది. అటు అజెండాపై రెండు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో 18వ జీఆర్ఎంబీ సమావేశం కూడా నిలిచిపోయింది. దీంతో తాగునీటి కేటాయింపులపై కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోతోంది. జనాభా ప్రాతిపదికన లేదా 50:50 నిష్పత్తిలో నీటి కేటాయింపులు చేయాలని తెలంగాణ కోరుతోంది. కల్వకుర్తి, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ద్వారా ఉమ్మడి మహబూబ్‌నగర్‌కు 5 టీఎంసీలతో పాటు, జూలై వరకు హైదరాబాద్, నల్గొండ, ఖమ్మం అవసరాలకు మొత్తం 46 టీఎంసీల తాగునీటిని కేటాయించాలని తెలంగాణ పట్టుబడుతోంది.

తెలంగాణ పల్లెలకు ఇంటింటికీ ఇంటర్నెట్
కేంద్రం, టి-ఫైబర్ మధ్య కుదిరిన కీలక ఒప్పందం

తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి ఇంటర్నెట్ సేవలను అందించేందుకు 'భారత్‌నెట్' ప్రాజెక్టును వేగవంతం చేసింది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం రూ.3,185 కోట్లు మంజూరు చేసింది.

గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలను విస్తరించే దిశగా మరో అడుగు పడింది. సవరించిన 'భారత్‌నెట్' పథకం కింద, కేంద్ర ప్రభుత్వానికి చెందిన డిజిటల్ భారత్ నిధి, టి-ఫైబర్ మధ్య ఒక ఒప్పందం కుదిరింది. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందించడంతో ప్రతి గ్రామీణ కుటుంబానికి హై-స్పీడ్ ఇంటర్నెట్‌ను అందించాలనే కల సాకారానికి మరింత దగ్గరైంది. ఈ కార్యక్రమం ఇప్పటికే పెద్దపల్లి, నారాయణపేట, సంగారెడ్డి జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్ లో అందుబాటులోకి తెచ్చిన ఏఐ ల్యాబ్ సేవలు మంచి ఫలితాలను ఇస్తున్నాయి. ఈ కొత్త ఒప్పందంతో గతంలో టీ-ఫైబర్ కు ఎదుర్కొన్న నిధుల కొరత సమస్య పరిష్కారమైంది.

నిధుల కొరతకు తీరిన పరిష్కారం

గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం భారత్‌నెట్ పథకాన్ని ప్రారంభించింది. టీ ఫైబర్ ద్వారా గ్రామాల్లో డక్ట్ వైర్ ఏర్పాటు చేసి, ప్రతి ఇంటికి ఇంటర్నెట్ సేవలను అందించడమే దీని లక్ష్యం. ప్రస్తుతం ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని 1,179 గ్రామ పంచాయతీలు, 482 ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంటర్నెట్ సేవలు అందుబాటులో ఉన్నాయి. మిగిలిన గ్రామ పంచాయతీలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలకు కూడా టీ ఫైబర్ కనెక్షన్లను విస్తరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం తాజాగా రూ. 3,185 కోట్ల నిధులను కేటాయించడానికి ఆమోదం

బంగాళాఖాతంలో తుపాన్ - తెలంగాణలో 3 రోజుల పాటు వర్షాలు!

మొదటి పేజి తరువాయి

ఏపీ-ఒడిశా మధ్య తీరం దాటే అవకాశం

ఇటీవల అర్నబ్, మురసు తుపాన్లతో రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. తాజాగా బంగాళాఖాతంలో మరో తుపాను బలపడుతోందని వాతావరణ శాఖ ప్రకటించింది. ఏపీలోని మచిలీపట్నం- ఒడిశాలోని గోపాల్‌పూర్ మధ్య ఎక్కడైనా ఈ తుపాను తీరం దాటొచ్చని, దీనిపై మరింత స్పష్టత రావాల్సి ఉందని ఐఎండీ అధికారులు చెబుతున్నారు. తుపాను వల్ల రాష్ట్రంలో 19 నుంచి 21 వరకు మూడు రోజుల పాటు ముఖ్యంగా తూర్పు తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

అక్వాన్ గా నామకరణం చేసిన ఇరాన్

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ఇవాళ తుపానుగా మారనుందని వాతావరణ శాఖ పేర్కొంది. దీనికి 'అక్వాన్'గా ఇరాన్ పేరు పెట్టింది. ఈ పదానికి రాక్షస శక్తి అని అర్థం. ఆదివారం



ఉదయం ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం అక్కడే కేంద్రీకృతమైంది. ఆదివారం సాయంత్రానికి ఇది గంటకు 15 కిలోమీటర్ల వేగంతో ఉత్తర వాయవ్య దిశగా పయనించినట్లు తెలిపింది. ప్రస్తుతం ఇది ట్రింకోమాలికి 620 కి.మీ., చెన్నైకి 800, విశాఖపట్నానికి 960 కి.మీ. దూరంలో ఉందని ఐఎండీ వివరించింది. ఇవాళ వాయుగుండం మరింత బలపడనుందని, దక్షిణ, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తుపానుగా మారనున్నట్లు వాతావరణ శాఖ పేర్కొంది.

గంటకు 90 నుంచి 130 కి.మీ. బలమైన గాలులు

రేపటికల్లా పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండం తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని ఐఎండీ ప్రకటించింది. తర్వాత రెండు రోజుల్లో మరింత బలపడి, ఉత్తర దిశగా ఆంధ్రప్రదేశ్ తీరం వైపు పయనిస్తుందని అంచనా వేసింది. రేపు ఉదయం నుంచి 18న మధ్యాహ్నం వరకు ఇది తీవ్ర తుపానుగానే కొనసాగొచ్చని ఐఎండీ తెలిపింది. ఆ తర్వాత మరింత బలపడి 18న రాత్రికి తీవ్ర తుపానుగా మారుతుందని, 19న ఉదయం వరకు అలాగే కొనసాగి, తెలంగాణ వైపు రానుందని వివరించింది. ఈ సమయంలో గంటకు 90 కి.మీ. నుంచి గరిష్ఠంగా 130 కి.మీ. వేగంతో చాలా బలంగా గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

రైతులకు ఎకరాకు రూ.25 వేల పరిహారం ఇవ్వాలి

మొదటి పేజి తరువాయి

ఎకరానికి రూ.25 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని కోరారు. రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్ర చరిత్రలో రైతులను పంటలు వేయవద్దని చెప్పిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే దక్కుతుందని కవిత విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని కరువు పరిస్థితులను ప్రస్తావించకపోవడం బాధాకరమని అన్నారు. ఇదిలా ఉండగా.. ఇంటర్ బోర్డు రద్దు అంశంపై త్వరలోనే రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు కవిత వెల్లడించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యారంగ నిపుణులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. మరోవైపు ఖైరవ యాత్రకు సంబంధించిన ఏర్పాట్లు వేగంగా కొనసాగుతున్నాయని, యాత్రను విజయవంతం చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు.

హరీశ్ రావు అవినీతిపై అన్ని ఆధారాలూ సీఎంకు అందజేస్తాం..

మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావుపై కవిత మరోసారి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. హరీశ్ రావు అవినీతికి సంబంధించిన అన్ని ఆధారాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అందజేస్తామని స్పష్టం చేశారు. కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా.. ఈ వ్యవహారాన్ని చట్టపరంగా కూడా ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. ఇప్పటికే విజిలెన్స్ కమిషన్, సెంట్రల్ విజిలెన్స్ కమిషన్, సీబీఐకీ లేఖల ద్వారా సంబంధిత ఆధారాలను అందజేస్తున్నామని వెల్లడించారు. అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణ జరగాలని.. వాస్తవాలు ప్రజల ముందుకు రావాలని అన్నారు. ఒకవైపు రాష్ట్రంలో కరువు పరిస్థితులు, రైతులకు నష్టపరిహారం,



ఇంటర్ బోర్డు అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే, మరోవైపు హరీశ్ రావుపై విమర్శలు, చట్టపరమైన పోరాటానికి సిద్ధమవుతున్నట్లు ప్రకటించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

వైసీపీ నేతల అవినీతిపై వెబ్ సిరీస్ తీస్తే అంతం ఉండదు.. అంతులేని కథలా సాగుతూనే ఉంటుంది

మొదటి పేజి తరువాయి

అమరావతి : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి అక్రమాలు, దోపిడీలపై వెబ్ సిరీస్ తీస్తే దానికి అంతం ఉండదని, అది ఒక అంతులేని కథలా సాగుతుందని రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నాటి పాలనలో జరిగిన అక్రమాలే ఆ పార్టీకి రాజకీయంగా సమాధి కట్టబోతున్నాయని ఆయన స్పష్టం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి జగన్ తో పాటు ఆయన చుట్టూ ఉన్న వారి అవినీతి బాగోతాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయని తెలిపారు. నాడు తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి అధికారాన్ని అడ్డం పెట్టుకుని సూట్‌కేస్ కంపెనీల ద్వారా వ్యవస్థలను ప్రభావితం చేసినట్లే, గత ఐదేళ్లలో తాడేపల్లి ప్యాలెస్ కేంద్రంగా జగన్ భారీ అవినీతి సామ్రాజ్యాన్ని నడిపించారని కొల్లు రవీంద్ర ఆరోపించారు. గతంలో పలువురు ఐఏఎస్ అధికారులు, ఉద్యోగులు, వ్యాపారవేత్తలను అవినీతి ఊబిలోకి దింపిన చరిత్ర ఆయనదని విమర్శించారు. మాజీ సీఎం కార్యాలయంలో నెలకు కేవలం రూ. 2 లక్షల జీతం తీసుకునే ఉద్యోగుల భార్యలు, కుటుంబ సభ్యులు, అనుయాయుల పేర్ల మీద



వందల కోట్ల రూపాయల ఆస్తులు, కంపెనీలు ఎలా వచ్చాయని ఆయన ప్రశ్నించారు. ఒక సాధారణ టిఫిన్ బండి నడుపుకునే వ్యక్తికి వందల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయో ప్రజలు గమనించాలని సూచించారు. కింది స్థాయి పీఏలే వేల కోట్లు దోచుకుంటే, పీటన్నింటికీ యజమానిగా ఉన్న జగన్ ఇంకెన్ని లక్షల కోట్లు దోచుకున్నారో సమాజం ఆలోచించాలన్నారు. గత ఐదేళ్లలో మద్యం కుంభకోణం, ఇసుక, మైనింగ్, పేదల భూముల ఆక్రమణల ద్వారా దోచుకున్న సొమ్మును విదేశాల్లోని వ్యాపారాల్లో పెట్టుబడులుగా పెట్టారని మంత్రి వివరించారు. రాష్ట్రంలో కొల్లగొట్టిన ప్రజాధనాన్ని దక్షిణాఫ్రికాలోని మద్యం, మైనింగ్ వ్యాపారాల్లోకి మళ్లించారని, అలాగే ఫిలిప్పీన్స్, థాయిలాండ్, మలేషియా వంటి దేశాలకు తరలించారని ఆరోపించారు. ఆ నిధులను తిరిగి దేశంలోకి తెచ్చుకోవడానికి దొంగ సాఫ్ట్‌వేర్ కంపెనీలు, సూటకేస్ కంపెనీలను సృష్టించారని, కుటుంబ సభ్యుల ఖాతాల్లోకి నిధులు తెచ్చి షోరూమ్‌లు, భూములు కొనుగోలు చేశారని పేర్కొన్నారు. ఈ అక్రమ కార్యకలాపాలపై విదేశీ ప్రభుత్వాలు కూడా దాడులు నిర్వహించాయని గుర్తుచేశారు. గత ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన 'జే బ్రాండ్స్' నాసిరకం మద్యం వల్ల కిడ్నీ, లివర్ వ్యాధులు, బ్రెయిన్ స్ట్రోక్‌లు వచ్చి అనేకమంది ప్రాణాలు కోల్పోయారని, దాదాపు 30 వేల మందికి పైగా మహిళలు చిన్న వయసులోనే వితంతువులుగా మారారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్తిలో వాటా అడిగినందుకు సొంత తల్లిని, చెల్లిని బయటకు పంపిన చరిత్ర వారిదని విమర్శించారు. ఐదేళ్ల పాటు సాగించిన దోపిడీ, దాడులను ప్రజలు ఇంకా మర్చిపోలేదని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో డిపాజిట్లు కూడా దక్కవనే భయంతోనే ప్రస్తుత ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజాధనాన్ని దోచుకున్న అసలు శక్తులు అతి త్వరలోనే పూర్తిస్థాయిలో బయటకు వస్తాయని, చట్టం ముందు ఎవరూ తప్పించుకోలేరని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు.

జమ్మూకశ్మీర్‌లో ఎన్ కౌంటర్- ఓ ఉగ్రవాది హతం

మొదటి పేజి తరువాయి

కలిసి పనిచేస్తున్నట్లు అధికారులు భావిస్తున్నారు. అనంతనాగ్‌లోని లాల్ చౌక్ ప్రాంతంలో జులై 22న జరిగిన పోలీస్ కానిస్టేబుల్ హత్య, కుల్గామ్ లో జులై 31న జరిగిన వలస కార్మికుల హత్యతో సహా 2026లో జరిగిన వరుస ఉగ్రదాడుల్లో భటాపై ఇప్పటికే ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు, కుల్గామ్ దాడి జరిగిన 24 గంటలలోపే, కిష్త్వార్ జిల్లాలో బాబీ చంద్, యశ్‌పాల్ కుమార్ అనే ఇద్దరు ప్రత్యేక పోలీసు అధికారులను ఉగ్రవాదులు హతమార్చారు. ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్‌లో భాగంగా సైన్యంలో చేరడానికి ఆ ఇద్దరు వెళ్తూ వెళ్తుండగా ఘటన జరిగినట్లు సమాచారం.

'వారిని న్యాయస్థానం ముందు నిలబెడతాం'

మరోవైపు, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ నలిన్ ప్రభాత్, కశ్మీర్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సుజిత్ కుమార్ ఇతర సీనియర్ అధికారులతో కలిసి కుల్గాంను ఆదివారం సందర్శించారు. భద్రతా పరిస్థితిని సమీక్షించి, ఉగ్రవాదుల ఏరివేతే లక్ష్యంగా సాగుతున్న ఆపరేషన్‌ను స్వయంగా పర్యవేక్షించారు. ఇదిలా ఉండగా, సీఆర్ పీఎఫ్ జమ్మూకశ్మీర్ జోన్ ప్రత్యేక డైరెక్టర్ జనరల్ సందీప్ ఖిర్వార్ మాట్లాడుతూ, ఇటీవల సీఆర్ పీఎఫ్ సైనికులపై జరిగిన ఉగ్రదాడికి సంబంధించి భద్రతా సంస్థలు కీలక ఆధారాలు సేకరించాయని, ఇందులో ప్రమేయం ఉన్నవారిని న్యాయస్థానం ముందు నిలబెడతామని చెప్పారు. భద్రతా సవాళ్లను ఎదుర్కోవడానికి సీఆర్ పీఎఫ్ సిద్ధంగా ఉందని, సంభావ్య ముప్పులను ముందుగానే ఊహించి సమర్థవంతంగా స్పందించేందుకు ఇతర ఏజెన్సీలతో సమన్వయం చేసుకుంటోందని చెప్పారు. అలాగే, నవంబర్ 11 దాడిలో గాయపడిన సిబ్బంది ఆరోగ్య పరిస్థితిపై కూడా ఆయన మాట్లాడారు. సైనికుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, శ్రీనగర్‌లోని 92 బేస్ హాస్పిటల్‌లో వారికి వైద్య చికిత్స అందిస్తున్నారని ఖిర్వార్ తెలిపారు. గాయపడిన వారిలో ఇద్దరిని తదుపరి చికిత్స కోసం దిల్లీకి తరలించగా, వారి ఆరోగ్యం కూడా బాగానే ఉందని చెప్పారు. నవంబర్ 11న కుల్గామ్ లోని మీర్ బజార్ సమీపంలో ఉన్న అఖ్రాన్ ప్రాంతంలోని సీఆర్‌పీఎఫ్ చెక్‌పాయింట్‌పై ఉగ్రదాడి జరిగింది. విధుల్లో ఉన్న సీఆర్ పీఎఫ్ సిబ్బందిపై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. అనంతరం, సమీపంలోని పొదల గుండా పారిపోయారు దుండగులు. ఆ దాడిలో ముగ్గురు సీఆర్ పీఎఫ్ సిబ్బంది గాయపడగా, వారిలో ఒకరి పరిస్థితి



విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఆ దాడికి సంబంధించి ఫోరెన్సిక్ ఆధారాలు సేకరించేందుకు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కూడా విచారణ చేపట్టింది. ఘటనా ప్రాంతంలో స్థానిక పోలీసు, సీఆర్ పీఎఫ్ దళాలు నిఘాను పెంచాయి. ప్రభావిత ప్రాంతాల్లో గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి. ఉగ్రదాడి అనంతరం ఘటనా స్థలంలో అదనపు బారికేడ్లు ఏర్పాటు చేసి, సాయుధ వాహనాలతో భారీగా బలగాలను మోహరించారు. క్విక్ రియాక్షన్ టీమ్‌తో కలిసి క్యాంప్ చుట్టుపక్కల ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ చేపట్టాయి.

తప్పుడు సమాచారం అందించారా? లేక సుప్రీంను తప్పుదోవ పట్టించారా?
అయోధ్య విరాళాలపై కాంగ్రెస్ కొత్త డిమాండ్

మొదటి పేజి తరువాయి

బీజేపీ, ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీలకు చెందిన వ్యక్తులను కాపాడేందుకు కేంద్ర, ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వాలు చేస్తున్న ప్రయత్నాలను బట్టబయలు చేస్తున్నాయని ఆరోపించారు. "దొంగతనానికి సంబంధించినది మాత్రమే కాదు. ఇప్పుడు తలెత్తుతున్న ప్రశ్న ఏమిటంటే దర్యాప్తు పేరుతో ప్రజలను, సుప్రీంకోర్టును తప్పుదోవ పట్టించారా? రెండు సిట్‌లను (ప్రత్యేక దర్యాప్తు బృందాలను) ఏర్పాటు చేశారన్నది స్పష్టంగా కనిపిస్తోంది. ఒకటి ప్రజలను మోసం చేయడానికి, మరొకటి కోర్టును మభ్యపెట్టడానికి. జులై 20న, మొదటి బృందం ఎలాంటి దర్యాప్తు చేపట్టడం లేదని ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. అయినప్పటికీ, ఆగస్టు 4న శాసనసభలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి, అదే బృందం నిర్వహించిన ప్రాథమిక దర్యాప్తును ఎందుకు ఉటంకించారు? ఇది ఏ ప్రాతిపదికన చేశారు? సభకు తప్పుడు సమాచారం అందించారా, లేక సుప్రీంకోర్టును తప్పుదోవ పట్టించారా? ఎలాంటి విచారణ జరగనప్పుడు, ఏ మధ్యంతర నివేదిక ఆధారంగా జులై 6న చంపత్ రాయ్‌కు ట్రస్ట్ 'క్లీన్ చిట్' ఇచ్చింది?" అంటూ జైరాం రమేశ్ ప్రశ్నించారు. ఐజీ కిరణ్ ఎస్. మొదటి బృందంలో సభ్యునిగా ఉన్నారు, అలాగే సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందానికి డైరెక్టర్‌గా కూడా వ్యవహరించారని చెప్పారు. మొదటి బృందం దర్యాప్తు చేపట్టకపోతే, అందులో ఆయన పాత్ర ఏమిటి? అంతేకాకుండా, ఆ బృందం లేదా అందులోని అధికారులు ట్రస్ట్‌కు ఏదైనా నివేదిక సమర్పించి ఉంటే, వారు ఏ అధికారంతో, ఎవరి ఆదేశాల మేరకు అలా చేశారని ప్రశ్నించారు. మొదటి (అందులో ఆయన సభ్యునిగా ఉన్నారు

ప్రజా న్యూస్ నెట్‌వర్క్
|| నిజం.. సమాజం.. ప్రజా కోసం.. || తెలుగు దినపత్రిక ||
17,నవంబర్ మంగళవారం 2026

యువతి అదృశ్యం ఆచూకీ కోసం పోలీసుల గాలింపు

డి. భరత్ నాయక్



బీఎన్ రెడ్డి మండల రిపోర్టర్ ప్రజా న్యూస్
వనస్థలిపురం: వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఈసీ నగర్, బీఎన్ రెడ్డి నగర్ కాలనీకి చెందిన వులరౌతు భార్గవి (20) అదృశ్యమైనట్లు పోలీసులు వెల్లడించారు.భార్గవి విశాఖపట్నంలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతూ హాస్టల్‌లో ఉంటోంది. అనారోగ్య కారణాలతో రెండు నెలల క్రితం ఇంటికి వచ్చిన ఆమె, తిరిగి హాస్టల్‌కు వెళ్తానని కుటుంబ సభ్యులకు తెలిపింది.ఈ క్రమంలో నవంబర్ 1, 2026న రాత్రి సుమారు 8:30 గంటల సమయంలో వనస్థలిపురంలోని కేఎల్ఎం షాపింగ్ మాల్ సమీపంలో విశాఖపట్నం వెళ్లేందుకు మినీ బస్సు ఎక్కింది. అప్పటి నుంచి ఆమె ఆచూకీ తెలియకపోవడంతో పాటు, మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు.బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో ఆమె తల్లి శోభారాణి వనస్థలిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి యువతి ఆచూకీ కోసం దర్యాప్తు చేపట్టారు యువతి భార్గవి ఆచూకీ తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా వనస్థలిపురం పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు కోరుతున్నారు.

రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ జోగిపేట

- ఆందోల్ ట్యాంక్ బండ్ ను పరిశీలించారు.





ప్రజా న్యూస్ నవంబర్ 16 ఆందోల్ ప్రతినిధి మహమ్మద్ ఆబేద్
ట్యాంక్ బండ్ తో పాటు బతుకమ్మ కుంట, డోబిఘాట్, హౌసింగ్ బోర్డు కాలనీ, నూతనంగా నిర్మిస్తున్న అంబేద్కర్ విగ్రహ నిర్మాణాన్ని పరిశీలించారు. ప్రతిపాదిత టూరిజం హోటల్ నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణాన్ని పూర్తి చేసుకొని ప్రారంభానికి సిద్ధంగా ఉన్నా నర్సింగ్ కాలేజ్ భవనాన్ని పరిశీలించారు. పలు సూచనలు చేశారు. త్వరలో ప్రారంభించేందుకు బ్యాలెన్స్ పనులు శరవేగంగా పూర్తి చేయాలని మంత్రి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ట్యాంక్ బండ్ ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ గారు పలు సూచనలు చేశారు.

కార్తీకమాస పర్యటనలో చంద్రశేఖర్ శివాచార్య మహాస్వామి.. ఆశీస్సులు పొందిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



(సంగారెడ్డి మండలం) నవంబర్ 16: ప్రజా న్యూస్ నెట్వర్క్ ప్రతినిధి సంతోష్ కుమార్..
సదాశివపేట పట్టణంలోని చీల మల్లన్న వ్యవసాయ క్షేత్రం ఫామ్‌హౌస్‌లో కార్తీకమాస పర్యటనలో భాగంగా విచ్చేసిన జ్ఞాన సింహాసనాధీశ్వర శ్రీశ్రీశ్రీ 1008 డాక్టర్ చంద్రశేఖర్ శివాచార్య మహాస్వామి వారిని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా మహాస్వామి వారికి పండ్లు సమర్పించి భక్తిశ్రద్ధలతో స్వాగతం పలికారు. మహాస్వామి వారి దివ్య ఆశీస్సులు పొందడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తెలిపారు. కార్తీకమాస పర్యటనలో భాగంగా స్వామివారి ఆధ్యాత్మిక సందేశాలు, ఆశీస్సులు భక్తులకు ఎంతో స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో దూది రామ్ చెట్టి, మట్టం రాచన్న స్వామి, శ్రీశైలం, ఈశ్వరప్ప, చుందు స్వామి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మయ్య భార్య మృతి పట్ల తీవ్ర సంతాపం కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పిన మంత్రి దామోదర రాజనర్సింహ.





ప్రజా న్యూస్ నవంబర్ 16 అందోల్ ప్రతినిధి (మహమ్మద్ అభేద్)
రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, బ్రహ్మయ్య భార్య మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్య నివాసానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.మృతురాలి చిత్రపటానికి నివాళులు అర్పించిన మంత్రి, బాధిత కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చి, వారికి ధైర్యం చెప్పారు.మంత్రి స్వయంగా వచ్చి పరామర్శించడం పట్ల బ్రహ్మయ్య కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పెన్షన్ మంజూరు పత్రాలు పంపిణీ

- ఎంపీడీవో ముఖపాటి నరసింహారావు, -సర్పంచ్ కొల్లు పుల్లమ్మ నాగయ్య





చిలుకూరు నవంబర్ 16(ప్రజా న్యూస్ నెట్ వర్క్ సూరిబాబు)
చిలుకూరు మండల కేంద్రంలో సోమవారం కమ్యూనిటీ హాల్ లో చేయూత పెన్షన్ లబ్ధిదారులకు వితంతువులకు, వికలాంగులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులకు పెన్షన్ మంజూరు పత్రాలు పంపిణీ చేయడం జరిగింది, ఈ కార్యక్రమం లో యడవల్లి పుల్లారావు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు సొందు,గ్రామపంచాయతీ కార్యదర్శి షఫీరుద్దీన్, 13వ వార్డు మెంబెర్ కందుకూరి స్వప్న నాగేశ్వరావు 14 వ వార్డు మెంబర్ నూకపంగు సతీష్ మరియు వార్డు మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు...

ప్రభుత్వ వైద్య కళాశాలలో న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ





(సంగారెడ్డి మండలం) నవంబర్ 16 ప్రజా న్యూస్ నెట్వర్క్ ప్రతినిధి సంతోష్ కుమార్..
ఈరోజు సంగారెడ్డిలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సంగారెడ్డి ఆధ్వర్యంలో కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జి శ్రీమతి బి. సౌజన్య గారు న్యాయ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా జాతీయ న్యాయ సేవాధికార సంస్థ (NALSA) రూపొందించిన ఐతీబస్త్ర ాఖుితీవఅవం ఖఅ ఔవశ్రీశ్రీఅవం ఛీుజఅస్త్రుఁఅశీఅ (ణాూఔచీ) ాఎష్ట్రవఎవ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం వల్ల కలిగే అనర్థాలు, యువతపై వాటి ప్రభావం, మాదకద్రవ్యాల వినియోగాన్ని నివారించాల్సిన ఆవశ్యకత, బాధితులకు అందుబాటులో ఉన్న సహాయ సేవలు మరియు పునరావాస మార్గాల గురించి వివరించారు.అదేవిధంగా ర్యాగింగ్ నిషేధ చట్టం, పోక్సో చట్టం (ాూజూూ ాూష్), సైబర్ నేరాలు మరియు వాటికి సంబంధించిన చట్టపరమైన నిబంధనలపై అవగాహన కల్పించారు. విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌కు పాల్పడటం చట్టరీత్యా నేరమని, విద్యార్థులు పరస్పరం గౌరవం, స్నేహభావంతో మెలగాలని సూచించారు.పోక్సో చట్టం ద్వారా బాలబాలికలకు కల్పించబడిన రక్షణ, బాలలపై లైంగిక వేధింపులకు సంబంధించిన నేరాలు, బాధిత పిల్లలకు అందుబాటులో ఉన్న చట్టపరమైన రక్షణ మరియు న్యాయ సహాయం గురించి వివరించారు.ప్రస్తుత డిజిటల్ యుగంలో పెరుగుతున్న సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియా దుర్వినియోగం, వ్యక్తిగత సమాచార భద్రత మరియు సైబర్ నేరాల బారిన పడినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండటంతో పాటు తమ హక్కులు, బాధ్యతలను గుర్తించి బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని కార్యదర్శి సూచించారు. చట్టపరమైన సమస్యలు ఎదురైనప్పుడు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

స్కూల్ అటెండర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలి పెండింగ్ జీతాలు చెల్లించాలి

కనీస వేతనం రూ.21,000 ఇవ్వాలి.. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలి TUCC జిల్లా నాయకులు చిరంజీవి



(సంగారెడ్డి మండలం) నవంబర్ 16 ప్రజా న్యూస్ నెట్వర్క్ ప్రతినిధి సంతోష్ కుమార్..
ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అటెండర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం, సంబంధిత విద్యాశాఖ అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఖజజ (ట్రేడ్ యూనియన్ కోఆర్డినేషన్ సెంటర్) జిల్లా నాయకులు చిరంజీవి డిమాండ్ చేశారు. స్కూల్ అటెండర్లకు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని, ప్రతి నెలా క్రమం తప్పకుండా జీతాలు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.కంగ్టి మండల కేంద్రంలో స్కూల్ అటెండర్ల సమస్యలపై నిర్వహించిన సమావేశంలో చిరంజీవి మాట్లాడుతూ.. పాఠశాలల్లో అటెండర్లు అనేక సంవత్సరాలుగా అంకితభావంతో విధులు నిర్వహిస్తున్నప్పటికీ, వారికి సకాలంలో వేతనాలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ పోషణ, పిల్లల చదువులు, నిత్యావసర ఖర్చులను భరించలేని పరిస్థితి నెలకొంటోందని తెలిపారు. నెలల తరబడి జీతాలు పెండింగ్‌లో పెట్టడం వల్ల అటెండర్లు అప్పులపాలవుతున్నారని పేర్కొన్నారు.ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న అన్ని నెలల వేతనాలను చెల్లించాలని, ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు అందేలా శాశ్వత చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ప్రస్తుతం అందిస్తున్న వేతనాలను పెంచి, స్కూల్ అటెండర్లకు కనీస వేతనంగా నెలకు రూ.21,000 చెల్లించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికులకు కల్పిస్తున్న విధంగా స్కూల్ అటెండర్లకు కూడా ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించి వారి కుటుంబాలకు సామాజిక భద్రత కల్పించాలని అన్నారు.పాఠశాలల నిర్వహణలో స్కూల్ అటెండర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సేవలను ప్రభుత్వం గుర్తించి తగిన గౌరవం, ఉద్యోగ భద్రత, న్యాయమైన వేతనాలు కల్పించాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న అటెండర్ల సమస్యలను అధికారులు నిర్లక్ష్యం చేయడం సరికాదని అన్నారు.ఈ సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే ప్రజావాణిలో ఫిర్యాదు చేయడంతో పాటు, ఎంపీడీవో కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించినట్లు తెలిపారు. మొత్తం 19 దరఖాస్తులను సంబంధిత అధికారులకు అందజేసి స్కూల్ అటెండర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు స్పందించి పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని, కనీస వేతనం రూ.21,000 అమలు చేయడంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో స్కూల్ అటెండర్లను ఐక్యం చేసి రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని చిరంజీవి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ సమావేశంలో సిద్ధి రాములు, వెంకటరెడ్డి, చంద్రకాంత్, నల్గొండ, సక్రం, లలితమ్మ, మీరాబాయి, కిష్టమ్మ, సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకలో పాల్గొన్న మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తులలక్ష్మారెడ్డి ..మాధవి దంపతులు..





మిర్యాలగూడ నవంబర్ 16 (ప్రజా న్యూస్ నెట్వర్క్ పి వెంకటయ్య)
మిర్యాలగూడ పట్టణ పరిధిలో ఆరో వార్డు అగ్రిగోల్డ్ కాలనీ కి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు వల్లపు రెడ్డి శ్రీనివాసరెడ్డి వసంత దంపతుల కుమారుడు వల్లపు రెడ్డి భరత్ రెడ్డి వెడ్స్ గాయత్రి రెడ్డి వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులకు శు భాకాంక్షలు తెలియజేసి ఆశీర్వదించిన మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి మాధవి దంపతులు..ఈ కార్యక్రమంలో ఆరో వార్డు కౌన్సిలర్ ఆడోత్ అశోక్ నాయక్ , ధనావత్ నాగు నాయక్ నియోజకవర్గ కార్యదర్శి , వార్డు అధ్యక్షుడు అంబటి వెంకటకృష్ణ, వంగాల శ్రీనివాసరెడ్డి , ముత్యాలమ్మ తల్లి దేవాలయ కమిటీ చైర్మన్ మోర ప్రభాకర్ , కట్ట భాస్కర్ రెడ్డి, చిలుక లక్ష్మారెడ్డి,గుమ్మ డేల్లి అంజి, కొమ్ముకోటి,ఎస్కే మస్తాన్ ఆర్.ఎం.పి, పోతన బోయిన వెంకటయ్య , మహిళా నాయకులు రమావత్ రాధా, ఎర్రబోతు రాణి, నే రృటియాదమ్మ, కొట్ట రాములమ్మ, గుమ్మ దే ల్లీ ప్రియాంక,గ్రామ పెద్దలు , బి ఎల్ ఆర్ బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి మీడియా వెన్నెముక ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధి పాత్రికేయులు డా. మునిర్ అహ్మద్ షరీఫ్

మిర్యాలగూడ నవంబర్ 16 (ప్రజా న్యూస్ నెట్‌వర్క్ పి వెంకటయ్య)

జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా పాత్రికేయులకు జనయేత్రీ ఫౌండేషన్ అభినందనలు
నవంబర్ 16 జాతీయ పత్రికా దినోత్సవం
ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికా రంగం పాత్ర ఎంతో కీలకమైనదని జనయేత్రీ ఫౌండేషన్ పేర్కొంది.
ప్రజలను చైతన్యపరచడంలో, సమాజంలోని సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా నిలవడంలో మీడియా అందిస్తున్న సేవలు అభినందనీయమని ఫౌండేషన్ అభిప్రాయపడింది.
సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అవినీతి, పేదల సమస్యలు, నిరుపేదల కష్టాలు, ప్రజా సమస్యలను నిర్భయంగా ప్రజల ముందుకు తీసుకువస్తూ సమాజ మార్పు కోసం పాత్రికేయులు చేస్తున్న కృషి వెలకట్టలేనిది.
ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయడంలో స్థానిక పాత్రికేయుల పాత్ర ఎంతో గొప్పది.
అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించడం, ప్రజల గొంతుకగా నిలవడం, సమాజానికి సరైన సమాచారాన్ని అందించడం పత్రికా రంగం బాధ్యత. అయితే వార్తల ప్రచురణలో నిజానిజాల పరిశీలన, నిష్పక్షపాత వైఖరి, సామాజిక బాధ్యత అత్యంత అవసరం.
ఎన్నో ఒత్తిళ్లు, సవాళ్ల మధ్య పనిచేస్తూ ప్రజల కోసం తమ సమయాన్ని కేటాయిస్తున్న ప్రతి పాత్రికేయుడికి ఈ సందర్భంగా జనయేత్రీ ఫౌండేషన్ హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తోంది.
కలం ప్రజల పక్షాన నిలిస్తే సమాజంలో మార్పు సాధ్యమవుతుంది. నిజాన్ని నిర్భయంగా వెలుగులోకి తీసుకువచ్చే పాత్రికేయులే ప్రజాస్వామ్యానికి నిజమైన బలం.జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా



పాత్రికేయులందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి వృత్తిపరమైన ప్రయాణం మరింత విజయవంతం కావాలని జనయేత్రీ ఫౌండేషన్ ఆకాంక్షిస్తోంది.
ఇట్లు, జనయేత్రీ ఫౌండేషన్ సమాజ సేవే లక్ష్యం ప్రజా చైతన్యమే మార్గం.

సిరి మువ్వ నాట్యాలయ శ్రీ పాద సిరి వెన్నెలకు ప్రథమ బహుమతి



మిర్యాలగూడ నవంబర్ 16(ప్రజా న్యూస్ నెట్‌వర్క్ పి వెంకటయ్య)



మిర్యాలగూడ పట్టణంలోని సిరిమువ్వ నాట్యాలయంలో చిన్నారులు కలకొండ రాము నాట్య గురువు దగ్గర కూచిపూడి లో నృత్యం నేర్చుకొని ఎంతోమంది విద్యార్థులు అవార్డులను సంపాదించారు. శనివారం బాలల దినోత్సవం సందర్భంగా రెండు ఉభయ తెలుగు రాష్ట్రాలలో నిర్వహించిన కూచిపూడి నాట్యం సీనియర్ విభాగంలో గుంటూరులోని అన్నమయ్య కళావేదికలో మంజీరా ఆర్ట్స్ అకాడమీ ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి నాట్య పోటీలలో కూచిపూడి నృత్యం పోటీలలో మిర్యాలగూడకు చెందిన శ్రీపాద సిరి వెన్నెల కు సినియర్ కేటగిరీలో ప్రథమ బహుమతినీ ఆంధ్రప్రదేశ్ హెరిటేజ్ అండ్ కల్చర్ డైరెక్టర్ చేతుల మీదుగా ప్రథమ బహుమతి బాల కళా రత్న అవార్డు అందుకోవటం జరిగింది. నాట్య గురువు కలకొండ రాము మాట్లాడుతూ శ్రీపాద సిరివెన్నెల 2020 నుండి 2026 వరకు హైదరాబాద్,తిరుపతి, గుంటూరు, నల్గొండ వివిధ ప్రాంతాలలో ఎన్నో బహుమతులను సాధించడం జరిగిందని వారి తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్లనే ఆరు సంవత్సరాలుగా పేరిని,కూచిపూడి, భరతనాట్యం నేర్చుకోవడం,చదువులో కూడా బాగా రాణిస్తుందన్నారు.ఇలాంటి బహుమతులు, అవార్డులు ఎన్నో సాధించాలని వారు కోరారు.

చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమానికి విచ్చేస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహకు ఘన స్వాగతం ఏర్పాట్లు చేసిన వైస్ చైర్మన్ చిట్టి బాబు.





ప్రజా న్యూస్ నవంబర్ 16 అందోల్ ప్రతినిధి (మహమ్మద్ అభేద్)

అందోల్‌జోగిపేటలో నిర్వహించనున్న చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమానికి రాష్ట్ర వైద్య, ఆరోగ్య, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ విచ్చేస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రికి ఘనంగా స్వాగతం పలికేందుకు పట్టణంలో ఏర్పాట్లు చేశారు.అందోల్‌జోగిపేట మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ఎ. సత్యనారాయణ (చిట్టి బాబు), కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మంత్రికి స్వాగతం పలుకుతూ పట్టణంలో భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.
చేయూత పథకం ద్వారా వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు ప్రతి నెలా పింఛన్లు అందనున్నాయి. మంత్రి చేతుల మీదుగా మంజూరు పత్రాలు అందుకోనున్న లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

“ప్రజాసంక్షేమమే పరమావధిగా ప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద.



కుత్బుల్లాపూర్. నవంబర్.16.ప్రజా న్యూస్ నెట్‌వర్క్ ..

ఈరోజు పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, నాయకులు, అభిమానులు, సంక్షేమ సంఘాల సభ్యులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిసి పలు ఆహ్వానాలు, వినతులు అందజేయగా సానుకూలంగా స్పందించారు.

రూ.9 కోట్ల వ్యయంతో భారీ నందీశ్వర స్వామి విగ్రహ నిర్మాణం

- 684 టన్నుల ఏకశిలతో సువర్ణ శృంగ నందీశ్వర విగ్రహ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టిన జగ్గారెడ్డి, నిర్మల

- మహాక్రతువులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి జగ్గారెడ్డి

(సంగారెడ్డి మండలం) నవంబర్ 16 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ ప్రతినిధి సంతోష్ కుమార్..
సంగారెడ్డి ఫసల్‌వాదిలోని శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ప్రాంగణంలో మహేశ్వర శర్మ సిద్ధాంతి పర్యవేక్షణలో రూ.9 కోట్ల వ్యయంతో నిర్మించ తలపెట్టిన భారీ సువర్ణ శృంగ నందీశ్వర స్వామి విగ్రహ శిలా పనులను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి, నిర్మల సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా భారీ ఏకశిలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.సంగారెడ్డి సమీపంలోని ఎర్దనూర్ గుట్టల నుంచి సేకరించిన 684 టన్నుల ఏకశిలతో 32 అడుగుల పొడవు, 19.5 అడుగుల ఎత్తు, 14 అడుగుల వెడల్పుతో నందీశ్వర స్వామి విగ్రహాన్ని రూపొందించనున్నారు.ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ, మహేశ్వర శర్మ సిద్ధాంతి చేపట్టిన ఈ మహత్తర ఆధ్యాత్మిక కార్యక్రమం సంగారెడ్డి ప్రాంతానికి గర్వకారణమని అన్నారు. ఈ మహాక్రతువు విజయవంతం కావడానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, భక్తులు, దాతలు తమకు తోచిన ఆర్థిక సహాయం అందించాలని పిలుపునిచ్చారు. తాను కూడా వ్యక్తిగతంగా తనవంతు సహకారం అందిస్తానని, ఆశ్రమ అభివృద్ధికి ప్రభుత్వ నిధులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ నిర్మాణం పూర్తయితే ఫసల్‌వాది ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత కిషన్, కాంగ్రెస్ నాయకులు, విద్యాపీఠ సభ్యులు, భక్తులు తదితరులు



పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం జగద్గిరిగుట్ట డివిజన్ శివ సీతారామాంజనేయ ఆలయంలో ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు ప్రత్యేక పూజలు

జగద్గిరిగుట్ట డివిజన్ మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్



కుత్బుల్లాపూర్. నవంబర్.16 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ ..

పిలుపు మేరకు మద్దూర్ నగర్ లోని శ్రీ శివ సీతారామాంజనేయ ఆలయం లో
ఈరోజు కార్తీక మాస మొదటి సోమవారం సందర్భంగా ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు కన్నె స్వామి విచ్చేసి స్వామివారిని అభిషేకించి ప్రత్యేక పూజలు నిర్వహించినారు. కార్యక్రమంలో శివ స్వాములు అయ్యప్ప స్వాములు వారి మిత్రబృందం పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా ఇందిరమ్మ ఇండ్లను ఇవ్వాలి.

గూడు లేని నిరుపేద వాళ్లకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి. గుడిపల్లి సర్పంచ్.

దేవరకొండ, గుడిపల్లి నవంబర్ 15,జట్టి శంకర్ యాదవ్.ప్రజా న్యూస్.

గుడిపల్లి గ్రామ సర్పంచ్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ గూడు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని అధికారంలో ఉన్న పార్టీ లీడర్లకు చెందిన వాళ్లకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు వస్తున్నానని ధ్వజమెత్తారు. గుడిపల్లి గ్రామానికి వచ్చినటువంటి ఇంద్రమ్మ ఇండ్లని రాజకీయ పార్టీలకు సంబంధం లేకుండా నిక్కసిగా నిజాయితీగా ఇండ్లు లేని పేద వాళ్ళకి ఇవ్వాలని అన్నారు. వాస్తవంగా గ్రామంలో కిరాయికి ఉన్నటువంటి వ్యక్తులకి అదే విధంగా కోటర్స్ లలో నివాసం ఉంటున్నటువంటి వ్యక్తులకి పథకాలు అమలు కావాలి. గ్రామ పాలకవర్గం గ్రామ ప్రథమ పౌరుడు సమక్షంలో జరగాలి అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్నటువంటి ప్రజావాణి కార్యక్రమంలో గుడిపల్లి గ్రామ సర్పంచ్ కొండ్రెడ్డి రాజశేఖర్ రెడ్డి అధికారులకు దరఖాస్తు ఇవడం జరిగింది పేదలకు వాస్తవంగా ఇండ్లు లేనటువంటి నిరుపేదలకు వారికి మాత్రమే



ఇందిరమ్మ ఇండ్లు దక్కాలి అని పేర్కొన్నారు.

ఆపదలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తకు చేయూత

- పేద ప్రజలకు అండగా ఉంటా- ఆరో వార్డు కౌన్సిలర్‌అశోక్ నాయక్

మిర్యాలగూడ నవంబర్ 16 (ప్రజా న్యూస్ నెట్‌వర్క్ పి వెంకటయ్య)
మిర్యాలగూడ పట్టణం 6వ వార్డు ఇందిరమ్మ కాలనీ లే అవుట్ 2 కు చెందిన నక్క వెంకటేశ్వర్లు (నక్కరావు) గత రెండు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నారని విషయం తెలుసుకొని 6వ వార్డు కౌన్సిలర్ అడోత్ అశోక్ నాయక్ గత నెల ఆర్థిక సహాయం చేయడం జరిగిందిఇచ్చిన మాట ప్రకారం వారి కుటుంబానికి 50ఎన్ఠ్ర ల బియ్యం మరల సహాయం చేసి వారికి అండగా నిలవడం జరిగింది. కౌన్సిలర్ చేస్తున్నటువంటి అభివృద్ధి పనులు మరియు పేద కుటుంబాలకు ఆదుకుంటున్నటువంటి సేవను చూసి కాలనీవాసులు, మహిళలు ,యూత్ హర్షం వ్యక్తం చేస్తున్నారు అశోక్ మాట్లాడుతూ నాకు వెన్నంటూ ఉండి నా గెలుపుకు మరియు కాంగ్రెస్ పార్టీకి విధేయులుగా ఉన్నటువంటి ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తకు అండగా ఉంటూఅన్ని విధాలుగా ఆదుకుంటానని అన్నారు. ఈకార్యక్రమంలోవార్డ్ అధ్యక్షుడు అంబటి వెంకటకృష్ణ, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ కార్యదర్శి నాగు నాయక్, ముత్యాలమ్మ తల్లి



దేవాలయ కమిటీ చైర్మన్ మోర ప్రభాకర్, కొట్ట ఆంజనేయులు, పల్లె భాస్కర్, మోర అశోక్, కొమ్ముకోటి, దొండ సైదులు, పాతన బోయిన వెంకటయ్య,కాంగ్రెస్ ముఖ్య నాయకులు,మహిళా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మోర హేమలత, నక్క వెంకటమ్మ, మోర జయ,కన్నెకంటి కళావతి, రమణ, బి ఎల్ ఆర్ బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు

హైదరాబాద్‌లో ఆటోల సమ్మె.. నవంబర్ 30న బంద్‌కు పిలుపు



హైదరాబాద్ లో నవంబర్ 30న ఆటోల బంద్‌కు మహాత్మా గాంధీ తెలంగాణ ఆటో డ్రైవర్స్ జేఏసీ పిలుపునిచ్చింది. పెంచిన ఆటో మీటర్ చార్జీలను వెంటనే అమలు చేయాలని, గ్రీన్ క్యాబ్‌లను నిషేధించాలని డిమాండ్ చేస్తూ ఈ సమ్మెకు దిగుతున్నట్లు ప్రకటించింది. 15 రోజుల్లో తమ డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చకపోతే బంద్ ఖాయమని, అప్పటికీ స్పందించకపోతే రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తన పదవికి రాజీనామా చేయాలని హెచ్చరించింది.హైదర్‌గూడలో నేడు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జేఏసీ కన్వీనర్ మహమ్మద్ అమానుల్లా ఖాన్ మాట్లాడారు. ప్రభుత్వం గ్రీన్ క్యాబ్‌లకు అనుమతి ఇవ్వడం వల్ల ఆటో, ట్యాక్సీ డ్రైవర్ల ఉపాధి దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రీన్ క్యాబ్‌లను తక్షణమే నిషేధించడంతో పాటు బెంగళూరులో మాదిరిగా నగరంలో బైక్ ట్యాక్సీలను రద్దు చేయాలని కోరారు.ఆటో డ్రైవర్లకు గతంలో హామీ ఇచ్చిన ప్రకారం, ఏడాదికి రూ. 12,000 చొప్పున మొత్తం రూ. 36,000 బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇటీవల దుండగుల దాడిలో మరణించిన ఆటో డ్రైవర్ మహమ్మద్ ముకరం కుటుంబానికి ప్రభుత్వం రూ. 10 లక్షల పరిహారం అందించాలని కోరారు.ఇటీవల ప్రభుత్వం ఆటో కనీస చార్జీని 1.6 కిలోమీటర్లకు రూ. 30గా, ఆ తర్వాత ప్రతి కిలోమీటర్‌కు రూ. 14గా నిర్ణయించిన విషయం తెలిసిందే. అయితే, ఈ చార్జీలు ఇంకా అమలులోకి రాకపోవడంతో డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ ఇన్చార్జి కోలన్ హనుమంత్ రెడ్డి



కుత్బుల్లాపూర్. నవంబర్.16 ప్రజా న్యూస్ నెట్వర్క్ ..

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో పలువురు పేద ప్రజలు అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో బాధితులు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ని సంప్రదించగా, ఆయన వెంటనే స్పందించి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి సీఎం ఆర్ ఎఫ్ ద్వారా శస్త్రచికిత్సలు, వైద్య చికిత్సల నిమిత్తం ఆర్థిక సహాయం మంజూరు చేయించారు.

ఈరోజు బాచుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకుల చేతుల మీదుగా లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరు పత్రాలు చెక్కులు అందజేశారు.

ద్వారా ఆర్థిక సహాయం పొందిన లబ్ధిదారుల వివరాలు:

1. బుల్లె ఐలయ్య 60,000
2. గొల్ల మల్లేష్ 30,000
3. ఎస్. రవి బాబు 45,000
4. కాసారానేని శేషగిరి రావు 60,000
5. నూర్ మహమ్మద్ గారు రూ. 40,000
6. మహమ్మద్ యాకుబీ రూ. 51,000

మొత్తం మంజూరైన ఆర్థిక సహాయం: రూ. 2,86,000.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సహాయనిధి పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో అండగా నిలుస్తోందని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్య చికిత్సలు పొందలేని నిరుపేదలకు ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేద ప్రజల సంక్షేమం, ఆరోగ్య భద్రతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, డీసీసీ సెక్రటరీ పండరి రావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు లక్ష్మా రెడ్డి, రషీద్, ప్రసన్న కుమార్, డప్పు నరేందర్, మహమ్మద్ గఫ్ఫార్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల పాత్ర సమాజానికి ఎంతో కీలకం..

- ప్రజాస్వామ్య పరిరక్షణలో మీడియా సేవలు అభినందనీయం..

- కుత్బుల్లాపూర్ టిడబ్ల్యూజేఎఫ్ నూతన కమిటీకి ప్రముఖుల అభినందనలు..





కుత్బుల్లాపూర్. నవంబర్.16 ప్రజా న్యూస్ నెట్వర్క్ ..

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ తెలంగాణ రాష్ట్ర జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) నూతన కమిటీ సభ్యులు సోమవారం పలువురు ప్రముఖులను మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ రాష్ట్ర ప్రోటోకాల్ అండ్ కోఆర్డినేషన్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి, మేడ్చల్ జిల్లా మత్స్యశాఖ సహకార సంఘాల (డీఎఫ్‌సీఎస్) చైర్మన్ మన్నె రాజు, కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ (ఐఏఎస్)లను కలిసి శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు వారు అభినందనలు తెలియజేసారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రోటోకాల్ అండ్ కోఆర్డినేషన్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి మాట్లాడుతూ,జర్నలిస్టుల పాత్ర, సమాజం పట్ల వారి బాధ్యతలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా నిలుస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో గొప్పదని పేర్కొన్నారు. మేడ్చల్ జిల్లా మత్స్యశాఖ సహకార సంఘాల (డీఎఫ్‌సీఎస్) చైర్మన్ మన్నె రాజు మాట్లాడుతూ,ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ కావడానికి మీడియా చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.జర్నలిస్టులు వాస్తవాలను ప్రజల ముందుంచుతూ, సమాజ అభ్యున్నతికి నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు. నూతన కమిటీ జర్నలిస్టుల ఐక్యతకు, సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగాలని సూచించారు. కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ ఐఏఎస్ మాట్లాడుతూ, ప్రభుత్వ అధికారులు, జర్నలిస్టుల మధ్య స్నేహపూర్వకమైన, పరస్పర గౌరవంతో కూడిన సంబంధాలు ఉండటం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తారని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు, మీడియా సమన్వయంతో పనిచేయాలని అభిప్రాయపడ్డారు. ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా ఇరువురి మధ్య సత్సంబంధాలు కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ,జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, వృత్తిపరమైన గౌరవం కోసం ఐక్యంగా పనిచేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అధ్యక్షులు ఏ. గోవిందరావు,కార్యదర్శి పి. బ్రహ్మచారి,ఉపాధ్యక్షురాలు మంజుల రెడ్డి, కమిటీ సభ్యులు కుమార్ గౌడ్, శ్యామ్ ముదిరాజ్, సుస్మిత, లక్ష్మి మేడ్చల్ జిల్లా కార్యదర్శి గడ్డమీది అశోక్, తేజోమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమం

– ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్న – అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఐపీఎస్

– ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాత విచారణ జరిపి, బాధితులకు సత్వర న్యాయం అందించాలి





(సంగారెడ్డి మండలం) నవంబర్ 16 ప్రజా న్యూస్ నెట్వర్క్ ప్రతినిధి సంతోష్ కుమార్..

జిల్లా ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఐపీఎస్ తెలిపారు. ఈ రోజు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను ఓపికగా విన్నారు. అనంతరం సంబంధిత ఎస్‌హెచ్‌ఓలతో ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యల వివరాలను తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ, స్థానిక పోలీస్ స్టేషన్లలో తమ సమస్యలకు పరిష్కారం లభించని పక్షంలో ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సూచించారు.ప్రజావాణి ద్వారా అందిన ప్రతి ఫిర్యాదుపై జిల్లా పోలీస్ కార్యాలయం నుండి ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగుతుందని, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రజలకు త్వరితగతిన, పారదర్శకంగా న్యాయం అందించడమే సంగారెడ్డి జిల్లా పోలీస్ శాఖ లక్ష్యమని అదనపు ఎస్పీ తెలియజేశారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుకు ఇంకా రెండేళ్లే గడువు

– మూడేళ్లు గడిచినా పూర్తిస్థాయిలో అమలుకాని హామీలు..

– పెండింగ్‌లో ఉన్న పింఛన్లను వెంటనే మంజూరు చేయాలి: ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

(సంగారెడ్డి మండలం) నవంబర్ 16 ప్రజా న్యూస్ నెట్వర్క్ ప్రతినిధి సంతోష్ కుమార్

సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నూతన పింఛన్ల మంజూరు పత్రాలు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ, స్థానిక ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ హాజరై లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు పూర్తవుతున్నా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు ఇంకా రెండేళ్ల సమయం మాత్రమే మిగిలి ఉందని, ఇప్పటికైనా అన్ని హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.మూడేళ్ల తర్వాత కొత్త పింఛన్లు మంజూరు చేయడం జరిగిందని పేర్కొంటూ, ఇంకా పెండింగ్‌లో ఉన్న పింఛన్ దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారందరికీ వెంటనే పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. అర్హత ఉన్నప్పటికీ పింఛన్లు అందక ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు న్యాయం చేయాలని సూచించారు.అలాగే కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద చెక్కులు పంపిణీ చేస్తున్న ప్రభుత్వం.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు తులం బంగారం ఎప్పుడు అందిస్తుందని ప్రశ్నించారు. కేవలం చెక్కుల పంపిణీకే పరిమితం కాకుండా, హామీ ఇచ్చిన తులం బంగారం పథకాన్ని కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సూచించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి, అర్హులైన లబ్ధిదారులకు




ప్రభుత్వ పథకాల ఫలాలు అందించాలని కోరారు.

వితంతు మహిళలు, వికలాంగులకు చేయూత పింఛన్ల పంపిణీ

- లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలు అందజేసిన ప్రజాప్రతినిధులు





((((ప్రజా న్యూస్ నవంబర్ 16 అందోల్ ప్రతినిధి మహమ్మద్ ఆబేద్)))))


వితంతు మహిళలు, వికలాంగులకు ప్రభుత్వం అందిస్తున్న చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను ఈరోజు సంగుపేటలోని లక్ష్మీదేవి గార్డెన్‌లో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పోసానిపేట గ్రామ సర్పంచ్ గోపాల్, గ్రామ కార్యదర్శి షాజహాన్, కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నాయకుడు చోటు ఖాన్ ముఖ్య అతిథులుగా పాల్గొని లబ్ధిదారులకు పింఛన్ మంజూరు సర్టిఫికెట్లను అందజేశారు. ఎన్నో రోజులుగా పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న మహిళలు, వికలాంగులకు పింఛన్లు మంజూరు కావడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలనే లక్ష్యంతో కార్యక్రమం నిర్వహించారు.

పుస్తక పఠనంతోనే విద్యార్థులకు విజ్ఞానం

- పాయకరావుపేట శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

పాయకరావుపేట, నవంబర్ 16 ప్రజా న్యూస్ నెట్వర్క్:

విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండి పుస్తక పఠనంపై దృష్టి సారించాలని పలువురు వక్తలు సూచించారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం ఉదయం 10 గంటలకు పాయకరావుపేట శాఖా గ్రంథాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ ఉద్యమానికి సేవలందించిన పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరి నాగభూషణం, గాడిచర్ల హరి సర్వోత్తమరావు, ఎస్.ఆర్. రంగనాథన్‌లకు పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలనతో నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సమయమంతుల రెడ్డి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు జాన్ పాల్ ప్రసాద్, శ్రీ చైతన్య కొబ్బరి తోట ప్రిన్సిపాల్ వివేక్, సమయమంతుల రెడ్డి హైస్కూల్ పీటీ మాస్టర్ పాల్గొన్నారు. గ్రంథాలయ ఉద్యమకారులకు వారు నివాళులర్పించారు. అనంతరం జాన్ పాల్ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి అక్కడ అందుబాటులో ఉన్న పుస్తకాలను చదవాలని సూచించారు. ముఖ్యంగా ప్రతి ఆదివారం గ్రంథాలయ సేవలను వినియోగించుకోవాలని కోరారు. వివేక్ మాట్లాడుతూ పాయకరావుపేట శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను చక్కగా నిర్వహిస్తున్నారని అన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్లను పక్కనపెట్టి పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. పుస్తక పఠనం ద్వారా విద్యార్థులు చదువులో రాణించగలరని పేర్కొన్నారు. విశ్రాంత లెక్చరర్ ఎస్. సీతారామమూర్తి మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమకారుల జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు తేజమూర్తుల వెంకటేశ్వరరావు కూడా విద్యార్థులు గ్రంథాలయాలకు వచ్చి పుస్తకాలు చదవాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా పెద్దల సమక్షంలో సీనియర్లు, జూనియర్లకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఇన్‌ఛార్జి వామాల లక్ష్మణరావు, గ్రంథాలయ కమిటీ సభ్యుడు ఎన్టీ సీతారామమూర్తి, వివిధ పాఠశాలలకు





చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హైకోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ 'ఎస్పీఆర్' స్కూల్ అక్రమ నిర్వహణ

– 107 రోజులు గడుస్తున్నా పేరు మార్చుకోని యాజమాన్యం.. – రోజుకు రూ. 10 వేల జరిమానా ఎక్కడ?

– లాబీయింగ్ ఒత్తిడితో ఆర్జేడీ కార్యాలయంలో మాయమైన ఫైలు.. – స్కూల్ సీజ్, విజిలెన్స్ విచారణకు డిమాండ్. బాబురామ్ నాయక్.

దేవరకొండ, నవంబర్ 16 ప్రజా న్యూస్.

రైట్ టు ఇన్ఫర్మేషన్ సర్వీస్ సొసైటీ (ఆర్టీఐఎస్ఎస్) వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు కేతావత్ బాబు రామ్ నాయక్ (ఎం.టెక్) ఆధ్వర్యంలో సోమవారం విద్యాశాఖ ఉన్నతాధికారులకు, ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదులు అందజేశారు. హైకోర్టు, కమర్షియల్ కోర్టు ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ నల్గొండ (డీవీకే రోడ్), కొండమల్లేపల్లిలలో సర్వేపల్లి రాధాకృష్ణ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో అక్రమంగా నడుస్తున్న "ఎస్పీఆర్ హైస్కూల్" పై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కేతావత్ బాబు రామ్ నాయక్, వైఎస్ఆర్ఎస్యూ జిల్లా అధ్యక్షులు ఎండీ సిరాజ్‌తో కలిసి తెలంగాణ సచివాలయంలోని ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ ఇన్‌వర్డ్ సెక్షన్), పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి మరియు సైఫాబాద్‌లోని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ & డైరెక్టర్ కార్యాలయంలో అడిషనల్ డైరెక్టర్ కె. సత్యనారాయణ రెడ్డి కి వేర్వేరుగా వినతిపత్రాలు సమర్పించారు.

వినతిపత్రంలోని ప్రధాన అంశాలు:

కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన & జరిమానా వైఫల్యం:

'ఎస్పీఆర్' పేరును వాడకూడదని కమర్షియల్ కోర్టు (సీ.ఓ.ఎస్. నెం. 21/2024) మరియు తెలంగాణ హైకోర్టు (రిట్ పిటిషన్ నెం. 12250/2026) స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాయి. దీని ప్రకారం 45 రోజుల్లోగా పాఠశాల పేరు మార్చుకోవాలని ఆర్జేడీఎస్ఈ, నల్గొండ డీఈవో ఆగస్టు 1, 2026న నోటీసులు జారీ చేశారు. నోటీసులు ఇచ్చి దాదాపు 3 నెలలు (107 రోజులు) గడుస్తున్నా పాత పేరుతోనే అక్రమంగా తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యాహక్కు చట్టం (ఆర్టీఈ యాక్ట్) సెక్షన్ 18(5) ప్రకారం రోజుకు రూ. 10,000 చొప్పున జరిమానా విధించాల్సి ఉన్నా అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. జీవో నెం. 91కి విరుద్ధంగా 'ఐఐటీ-జేఈఈ', 'ఒలింపియాడ్' పేర్లతో బ్రోచర్లు పంచుతూ తల్లిదండ్రులను మోసం చేస్తున్నారు.

ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణం - విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం

కొండమల్లేపల్లి క్యాంపస్ భవనాన్ని వాల్టా చట్టానికి విరుద్ధంగా చెరువు ఎఫ్‌టీఎల్ / బఫర్ జోన్‌లో అక్రమంగా నిర్మించారు. అంతేకాకుండా, ఫైర్ సేఫ్టీ ఎన్ఓసీ, విద్యాశాఖ మరియు సంక్షేమ శాఖల అనుమతులు లేకుండానే బాలుర హాస్టల్ నిర్వహిస్తూ వందలాది మంది గిరిజన (ఎస్టీ), గ్రామీణ విద్యార్థుల ప్రాణాలను ప్రమాదంలోకి నెడుతున్నారు.

ఆర్జేడీ కార్యాలయంలో ఫైలు మాయం:

ఈ అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆర్టీఐ సొసైటీ ఇచ్చిన ఫిర్యాదుపై ఆరా తీయగా, హైదరాబాద్ ఆర్జేడీఎస్ఈ కార్యాలయ సిబ్బంది "ఫైలు కనిపించడం లేదు/మాయమైంది" అని చెప్పడం విస్మయానికి గురిచేస్తోందని కేతావత్ బాబు రామ్ నాయక్ ఆరోపించారు. ఉన్నత స్థాయి లాబీయింగ్, ఒత్తిళ్ల వల్లే కింది స్థాయి అధికారులు నిస్సహాయంగా మారారని ఆయన పేర్కొన్నారు.

ఆర్టీఐ సర్వీస్ సొసైటీ
ప్రధాన డిమాండ్లు:

పదో తరగతి పరీక్షా ఫీజులకు అనుమతి నిరాకరణ:

గుర్తింపు, సరైన పేరు లేని ఈ పాఠశాలల నుండి 2027 మార్చి పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫీజులు, నామినల్ రోల్స్ స్వీకరించకుండా ఎస్ఎస్సీ బోర్డు, ఆర్జేడీ, డీఈవోలకు తక్షణ ఆదేశాలు జారీ చేయాలి.

పాఠశాల, హాస్టల్ సీజ్ & కూల్చివేత:

నల్గొండ డీవీకే రోడ్, కొండమల్లేపల్లి క్యాంపస్‌లతో పాటు అనుమతి లేని బాలుర హాస్టల్‌ను తక్షణమే సీజ్ చేయాలి. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలి.

విజిలెన్స్ విచారణ & జరిమానా వసూలు:

ఆర్జేడీ కార్యాలయంలో ఫైలు మాయమవ్వడంపై విజిలెన్స్ మరియు శాఖాపరమైన విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. రెండు పాఠశాలల నుండి రోజుకు రూ. 10 వేల చొప్పున 107 రోజుల జరిమానాను వసూలు చేయాలి.

విద్యార్థులకు న్యాయం & క్రిమినల్ కేసులు:



ప్రస్తుతం చదువుతున్న విద్యార్థుల విద్యా సంవత్సరం నష్టపోకుండా సమీపంలోని గుర్తింపు పొందిన పాఠశాలల్లో సర్దుబాటు చేయాలి. మోసానికి పాల్పడిన యాజమాన్యంపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 318(4) కింద క్రిమినల్ కేసు నమోదు చేయాలి.
ఈ కార్యక్రమంలో రైట్ టు ఇన్ఫర్మేషన్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు కేతావత్ బాబు రామ్ నాయక్, వైఎస్ఆర్ఎస్యూ జిల్లా అధ్యక్షులు ఎండీ సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

తునిలో మురళీకృష్ణకు ఘన సత్కారం

- జనసేన వీరమహిళ శ్రావణి సాయి ఆధ్వర్యంలో అభినందన సభ

తుని, నవంబర్ 16 ప్రజా న్యూస్ నెట్వర్క్: ప్రముఖ వాస్తు, సంఖ్యాశాస్త్ర నిపుణులు శ్రీ మురళీకృష్ణను తుని నియోజకవర్గంలో జనసేన నాయకులు ఘనంగా సత్కరించారు. జనసేన వీరమహిళ శ్రావణి సాయి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయనకు శాలువా కప్పి, పూలమాల వేసి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా శ్రావణి సాయి మాట్లాడుతూ వాస్తు, సంఖ్యాశాస్త్ర రంగాల్లో మురళీకృష్ణకు ఉన్న పరిజ్ఞానం ఎంతోమందికి ఉపయోగపడుతోందని తెలిపారు. ఈ రంగాల్లో ఆయన అందిస్తున్న మార్గదర్శకత్వం ద్వారా వేలాది మంది ప్రయోజనం పొందుతున్నారని పేర్కొన్నారు. సమాజానికి ఆయన చేస్తున్న సేవలు ప్రజల్లో భరోసా, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తున్నాయని



అభినందించారు. సత్కారానికి స్పందించిన మురళీకృష్ణ తనకు గౌరవం కల్పించిన శ్రావణి సాయికి, జనసేన కుటుంబ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల శ్రేయస్సు కోసం తన వంతు సేవలను భవిష్యత్తులోనూ కొనసాగిస్తానని అన్నారు. ఈ అభినందన కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు, మురళీకృష్ణ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రైటప్ పూజా కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్ కు సన్మానం చేసిన స్వాములు

వైభవంగా శ్రీ అయ్యప్ప స్వామి మహా మండల పడి పూజ-



చిలుకూరు, నవంబర్ 16, (ప్రజా న్యూస్ నెట్ వర్క్ సూరిబాబు) మండల కేంద్రంలోని భారత్ పెట్రోల్ బంక్ ప్రక్కన ఉన్న ఆవరణలో కాంపాటి గురవయ్య నాగమణి గురు స్వామి 18 వ పడి శ్రీ అయ్యప్ప స్వామి మహా మండల పడిపూజ (నారికేల) సందర్భంగా ఆదివారం రాత్రి శ్రీ అయ్యప్ప స్వాముల భక్త బృందం కొత్త చిలుకూరు వారి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా శ్రీ అయ్యప్ప స్వామి మహా మండల పూజ వైభవంగా నిర్వహించారు, కార్యక్రమంలో కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, చిలుకూరు సర్పంచ్ కొల్లు పుల్లమ్మ నాగయ్యలు పాల్గొని అయ్యప్ప స్వామికి పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా గణపతి హోమం, సమస్త దేవత ప్రార్థన, ధూపము, నైవేద్యముకర్పూర హారతి, శ్రీ అయ్యప్ప స్వామి పూజ, 18 రకాల కలశములతో అభిషేకాలు, కలశపూజ, 18 రకాల పడిపూజ నిర్వహించి కాంపాటి గురవయ్య గురుస్వామి పడిని వెలిగించారు, వివిధ గ్రామాల నుండి మాలలు ధరించిన స్వాములు అధిక సంఖ్యలో రావడంతో చిలుకూరు గ్రామం అయ్యప్ప స్వాముల నామస్మరణలతో మారు మ్రోగింది, భరత్ స్వామి ఆలపించిన భక్తి గేయాలు ఆకట్టుకున్నాయి, మాలలు ధరించిన స్వాములకు వడ్డేపల్లి రామకృష్ణ దంపతులు భక్తులకు భిక్ష తీర్థప్రసాదాలు అందించారు, 18వ పడి సందర్భంగా కాంపా టి గురవయ్య నాగమణి దంపతులను అయ్యప్ప స్వామి భక్త బృందం కొత్త చిలుకూరు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు, రామకృష్ణ(తాంత్రి) గురుస్వామి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి, ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు గురు స్వాములు తదితరులు పాల్గొన్నారు....

జిహెచ్ఎంసి క్యూర్ పరిధిలోని పరిశుద్ధ కార్మికులకు ఇందిరమ్మ టవర్స్ కేటాయించాలి

- ఐఎన్ టి యు సి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబీసీ జాతి అధ్యక్షుడు గూడ ఐలయ్య గౌడ్ విజ్ఞప్తి

కుత్బుల్లాపూర్. నవంబర్.16 ప్రజా న్యూస్ నెట్వర్క్ .. రోడా మేస్త్రి నగర్ మద్దుమ్ నగర్ జగదిరిగుట్ట మాజీ కౌన్సిలర్ కాంగ్రెస్ నాయకులు గూడ వరమ్మ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఐ ఎన్ టి యు సి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓ బి సి జాతీయ అధ్యక్షులు గూడఐలయ్య గౌడ్ మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాదులో ఉన్న క్యూర్ పరిధిలో ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ పరిశుద్ధ కార్మికులకు ఇందిరమ్మ టవర్స్ కేటాయించాలని హైదరాబాదుకు వివిధ జిల్లాల నుండి వలస వచ్చిన వారికి ఉపాధితో పాటు ఇళ్ల స్థలాలను పేద కార్మికులకు వలస కార్మికులకు అందించిన చరిత్ర మాజీ కేంద్రమంత్రి గుడిసెల గడ్డం వెంకటస్వామి మరియు తెలంగాణ రాష్ట్ర కార్మిక మంత్రి పి జనార్దన్ రెడ్డి మాజీ ముఖ్యమంత్రి కార్మిక నాయకుడు అంజయ్య హైదరాబాద్ వలస వచ్చిన పారిశ్రామిక వాడలోని వేలాది మందికి ఇందిరా గాంధీ పారిశ్రామిక వాడల ను హైదరాబాదు లో తయారు చేస్తే వారికి నివాసం ఉండడానికి స్థలాలు కల్పించిన కాంగ్రెస్ నాయకులను నేటితరం నాటి తరం కార్మికులు గుర్తు చేసుకుంటున్నారని గతంలో కరోనా వచ్చినప్పుడు పరిశుద్ధ కార్మికులు అద్దె ఇంటిలో ఉండి రోడ్డుపైనే జీవనం గడిపారు గుర్తు చేశారు హైదరాబాద్ క్యూర్ పరిధిలోని పరిశుద్ధ కార్మికులకు కాంగ్రెస్ పరిపాలనలో ప్రజాపాలనలో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి పారిశుద్ధ కార్మికులకు వివిధ కార్పొరేషన్ల పరిధిలోని పరిశుద్ధ కార్మికులకు ఇందిరమ్మ టవర్స్ కేటాయించి హైదరాబాద్ వలస వచ్చిన కార్మికులకు అండగా నిలబడ్డ కార్మిక నాయకులు గుడిసెల వెంకటస్వామి పి జనార్దన్ రెడ్డి అంజయ్య పేరుమీద పరిశుద్ధ కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లను కేటాయించాలని ముఖ్యమంత్రిని కోరారు ఈ విషయంపై మాజీ ఎమ్మెల్యే కార్మిక నాయకుడు శ్రీశైలం గౌడ్ ఐ ఎన్ టి యు సి జాతీయ అధ్యక్షులు అంబటి కృష్ణమూర్తి రాష్ట్ర అధ్యక్షులు గుంజ శ్రీనివాస్ జాతీయ కార్యదర్శి డాక్టర్ అమర్ బాబు దళిత సంక్షేమ సంఘం రాష్ట్రీయ చైర్మన్ జేబీ రాజు ప్రధాన కార్యదర్శి వై బాలరాజు అధ్యక్షులు జేమ్స్ నాయకత్వంన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కలిసి వినతిపత్రం ఇస్తామని ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని పది సంవత్సరంలో టిఆర్ఎస్ ప్రభుత్వంలో కనీస వేతనాన్ని అమలు చేయని దుర్మార్గ పరిపాలన కొనసాగిందని నేడు ముఖ్యమంత్రి ప్రజాపాలనలో తెలంగాణ రాష్ట్రం ఐదు



లక్షల మంది ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ కార్మికులకు కనీస వేతన0 చట్టాన్ని చేసిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేశారు అదేవిధంగా కాంగ్రెస్ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ పాదయాత్ర వచ్చినప్పుడు అసంఘటిత రంగంలోని కార్మికులకు మాట ఇచ్చిన ప్రకారం గీ 0గ్ కార్మికులకు చట్టాన్ని తెచ్చి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసే చరిత్ర ఆనాడు భవన నిర్మాణ కార్మికులకు దేశవ్యాప్తంగా సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేసిన చరిత్ర యూపీఏ చైర్ పర్సన్ సోనియాగాంధీ కాంగ్రెస్ పార్టీకే దక్కిందని అన్నారు కుత్బుల్లాపూర్ జోన్ కమిషనర్ సుంకేష్ కుమార్ కి ఐ ఎన్ టి యు సి కుత్బుల్లాపూర్ నియోజక వర్గం అధ్యక్షులు కృష్ణ గౌడ్ ఐ ఎన్ టి యు సి మీసేవ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ ప్రజావాణిలో వినతి పత్రం ఇచ్చారు

మఠంపల్లిలో నాటు సారాయి స్థావరాలపై పోలీసుల దాడులు

– మూడు డ్రమ్ముల బెల్లం పానకం ధ్వంసం.. 10 లీటర్ల నాటు సారాయి స్వాధీనం

మఠంపల్లి, నవంబర్ 16 (ప్రజా న్యూస్ నెట్‌వర్క్)

: మఠంపల్లి మండలంలో నాటు సారాయి తయారీ, విక్రయాలను అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ ఆదేశాల మేరకు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బృందాలు బిల్యానాయక్ తండా, బాదవ తండాతో పాటు మరో ప్రాంతంలో ఏకకాలంలో ఆకస్మిక దాడులు చేపట్టాయి.ఈ తనిఖీల్లో రెండు ప్రాంతాల్లో నాటు సారాయి తయారీకి ఉపయోగించే బెల్లం పానకాన్ని మూడు ప్లాస్టిక్ డ్రమ్ముల్లో నిల్వ ఉంచినట్లు గుర్తించిన పోలీసులు వాటిని ధ్వంసం చేశారు. అదేవిధంగా మూడు ప్రాంతాల్లో కలిపి మొత్తం 10 లీటర్ల నాటు సారాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలకు సంబంధించి రెండు కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్ఐ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ నాటు సారాయి తయారీ, విక్రయాలు చట్టరీత్యా నేరమని, ప్రజల ఆరోగ్యానికి హానికరమైన ఇటువంటి అక్రమ కార్యకలాపాలకు ఎవరూ పాల్పడవద్దని హెచ్చరించారు. గ్రామాల్లో నాటు సారాయి తయారీ, విక్రయాలపై నిరంతరం నిఘా కొనసాగిస్తామని, అక్రమాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నాటు సారాయి నిర్మూలనకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

